నిధులు నిరుపయోగం

- శిథిలావస్థలో షాదీఖానా భవనాలు
- అసంపూర్తిగా నిర్మాణాలు
- దశాబ్దాలుగా నిలిచిపోయిన పనులు

హత్నూర(సంగారెడ్డి): మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదు. వారి కోసం నిర్మించిన షాదీఖానా భవనాలే అందుకు ఉదాహరణ. దశాబ్దాలు గడుస్తున్నా ఆ భవన నిర్మాణాలు మాత్రం పూర్తి కావడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన షాదీఖానా భవనాలు తెలంగాణ రాష్ట్రం సిద్ధించినప్పటికీ అసంపూర్తిగానే మిగిలాయి.


హత్నూరలో శిథిలావస్థకు చేరిన షాదీఖానా భవనం

పదేళ్లపాటు పట్టించుకోలేదు

పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కనీసం పట్టించుకోలేదని ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోలైనా నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉందని మైనార్టీ వర్గాలు కోరుతున్నాయి. హత్నూరలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రవాణాశాఖ మంత్రిగా ఉన్న ప్రస్తుత మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. మైనార్టీల సంక్షేమం కోసం భవనాన్ని నిర్మించినా తగిన వసతులు లేవు. దీంతో దశాబ్దాలుగా అది నిరుపయోగంగానే ఉంది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. కిటికీలు, తలుపులు పూర్తిగా చెడిపోయాయి. పట్టించుకునే నాథుడులేక లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం కాస్తా వృథాగా మిగిలింది.

అలాగే కాసాల దౌల్తాబాద్ గ్రామ శివారులో 2004 జూలై 24న అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి షాదీఖానా భవన నిర్మాణం కోసం రూ.7.50 లక్షలు మంజూరు చేయించి పనులకు శంకుస్థాపన చేశారు. అప్పట్లో కాంట్రాక్టర్ హడావుడిగా పిల్లర్ల స్థాయి వరకు పనులు చేయించి వదిలేశారు. దశాబ్దం గడిచిపోవడంతో అక్కడ పిచ్చి మొక్కలు మొలిచి అస్తవ్యస్తంగా తయారైంది. మైనారిటీల సంక్షేమం కోసం నిర్మించిన షాదీఖానా భవనాలు నిరుపయోగంగా నిలిచాయి. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిర్మాణాలను పూర్తి చేయించాలని మైనార్టీ నేతలు కోరుతున్నారు.

నూతనంగా నిర్మించాలి



రాష్ట్ర ప్రభుత్వం హత్నూరలో నూతనంగా షాదీఖానా భవనం నిర్మించాలి. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం సౌకర్యాలు లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. కాసాల దౌల్తాబాద్ గ్రామాల సమీపంలో పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన భవనాన్ని పూర్తిస్థాయిలో నిర్మించాలి. అధికారులు, నేతలు ప్రత్యేక చొరవ చూపాలి.

– ఆసిఫ్, హత్నూర వార్డు సభ్యుడు

భూములు లాక్కోవడం సరైంది కాదు

మానవ హక్కుల వేదిక ప్రతినిధులు

జిన్నారం(పటాన్‌చెరు): రైతుల భూములను బలవంతంగా లాక్కోవడం సరైంది కాదని మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిన్నారం మండలంలోని గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని అల్లీనగర్ గ్రామంలోని 27వ సర్వే నంబర్‌లో రైతులు సాగు చేసుకుంటున్న భూములను పరిశ్రమ ఏర్పాటు పేరిట లాక్కోవడంతో ఆదివారం మానవ హక్కుల నిజనిర్ధారణ కమిటీ నాయకులు రైతులతో సమావేశమయ్యారు. రైతులతో మాట్లాడిన నాయకులు వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రైతులు సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా పరిశ్రమల స్థాపన పేరిట లాక్కోవడం సరైంది కాదన్నారు. రైతులకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నిజనిర్ధారణ కమిటీ నాయకులు శంకర్, సురేశ్, రోహిత్, సంజీవ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న నాయకులు

మంత్రికి విశ్రాంత ఉద్యోగుల సన్మానం

జోగిపేట(అందోల్): అందోలు మండల విశ్రాంత ఉద్యోగులు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహను మర్యాద పూర్వకంగా కలిశారు. సంగారెడ్డిలోని ఆయన స్వగృహంలో ఆదివారం శాలువా, బొకేలతో సన్మానించారు. స్థానికంగా రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి, కె.మనోహర్ ప్రసాద్‌లతో పాటు కార్యవర్గ సభ్యులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.


మంత్రి దామోదర రాజనర్సింహను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

దివ్యాంగుడికి ఆప్యాయ పలకరింపు..

అందోలులో ఓ వివాహ వేడుకకు హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ దూరంగా నిలబడి ఉన్న ఒక దివ్యాంగుడిని గుర్తించి అతడి వద్దకు వెళ్లి యోగక్షేమాలను తెలుసుకున్నారు. మంత్రి వివాహానికి హాజరవుతున్నట్లు తెలుసుకున్న ఆ దివ్యాంగుడు మంత్రిని కలిసేందుకు ఫంక్షన్ హాలుకు వచ్చినట్లుగా చెప్పాడు. తన ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకురాగా, నాలుగైదు రోజుల్లో తనను స్వయంగా కలవాలని మంత్రి భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

రూ.5 లక్షల ఇన్సూరెన్స్ పాలసీ హర్షణీయం

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ నేతలు

పటాన్‌చెరు టౌన్: రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు స్విగ్గీ, జొమాటో, హోంగార్డులు, వర్కింగ్ జర్నలిస్టులు, ఫ్లాట్ ఫారమ్ కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా అమలు చేయడం హర్షించదగ్గ విషయమని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటుచేసి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు మాదాసు రాజశేఖర్, న్యాయవాది రంగారావు నాయకులు ఆసిఫ్, సురేశ్, ఆటో యూనియన్ నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

జగ్గారెడ్డి నివాసంలో మహా పడిపూజ


పూజ చేస్తున్న భరత్‌సాయిరెడ్డి, సతీమణి నిర్మలారెడ్డి

సంగారెడ్డి: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి నివాసంలో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం జగ్గారెడ్డి పూజలు నిర్వహిస్తే ఈ సారి ఆయన కుమారుడు భరత్ సాయిరెడ్డి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మలరెడ్డి మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోపాజి అనంత కిషన్ పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవం కరపత్రాల పంపిణీ

మునిపల్లి(అందోల్): టెక్మాల్ మండలం వెల్పుకొండ శ్రీసీతారామ దేవాలయంలో మంగళవారం నిర్వహించే లక్ష దీపోత్సవ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆత్మానందాశ్రమ అధ్యక్షుడు గుర్రాల భానుప్రకాశ్, ఆధ్వర్యంలో భక్తులకు పంపిణీ చేశారు. మండలంలోని బుదేరా, కంకోల్, పొల్కంపల్లి, మునిపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం కరపత్రాలను అందజేశారు. రుస్తుంపేట శ్రీఆత్మానందాశ్రమ పీఠాధిపతి శ్రీభగవద్భక్త పరాగ పూజ్య పాద రాజయోగి వెంకటస్వామి ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్టు అంజయ్య, మల్లేశం, నాగయ్య, నర్సింలు, విఠల్ తెలిపారు.

నేటి నుంచి అన్నదానం

సంగారెడ్డి: పట్టణ శివారులోని శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో జనవరి 1వ తేదీ నుంచి నిత్యాన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ టోపాజి అనంత కిషన్ ఆదివారం తెలిపారు. ఆలయంలో సోమవారం అఖండ భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: హనుమాన్ మందిరం రోడ్డు ప్రాంతంలో హరేరామ హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే భజనలు చేస్తూ ఆ ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించారు. భగవద్గీత, రామాయణాల ప్రాముఖ్యత గురించి వివరించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు


పార్టీలో చేరిన వారితో సురేందర్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆదివారం మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఆయన కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గణేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామ శివారులో శనివారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెటల్‌కుంట సర్పంచ్ పీటర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భాస్కర్, నర్సింహారెడ్డి, రాజేందర్‌రెడ్డి, మామిడ్గి, రాజోల సర్పంచ్‌లు చంద్రన్న, మైపాల్ తదితరులు పాల్గొని కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ముత్తంగిలో ఘనంగా మల్లన్న స్వామి జాతర

పటాన్‌చెరు: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ముత్తంగి గ్రామంలో నిర్వహిస్తున్న భ్రమరాంబికామల్లికార్జునస్వామి జాతర మహోత్సవంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులు కేటాయించారన్నారు. నియోజకవర్గంలోనూ నూతన దేవాలయాల నిర్మాణాలతో పాటు పురాతన దేవాలయాలను సొంత నిధులతో జీర్ణోద్ధారణ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేశ్ తదితరులు పాల్గొన్నారు.


జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

స్ట్రీట్ లైట్ల ప్రారంభం

అమీన్‌పూర్ మున్సిపాలిటీ అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం నవ్య చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు రూ.65 లక్షల హెచ్ఎండీఏ నిధులతో ఏర్పాటు చేసిన 108 వీధి దీపాలను మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మకు ప్రత్యేక పూజలు

మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా ఆదివారం సీతారామపురం కాలనీ వాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నందుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీలోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, మాజీ ఎంపీటీసీ రామచంద్రారెడ్డి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన జహీరాబాద్ ఎంపీపీ

జహీరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని జహీరాబాద్ ఎంపీపీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం కోఆర్డినేటర్ ఎస్.గిరిధర్‌రెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శనివారం సీఎం క్యాంపు కార్యాలయంలో రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనురుధ్‌రెడ్డిలతో కలిసి గిరిధర్‌రెడ్డి సీఎంను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

ఎంపీడీవోల జిల్లా కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి జిల్లా మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. స్థానిక జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా సంగారెడ్డి ఎంపీడీవో ఆకుల రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మున్నూరు ఎంపీడీవో షఫిలుద్దీన్, కోశాధికారిగా రాయికోడ్ వెంకటేశం, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం నల్లవాగు బాలుర గురుకుల పాఠశాలలో 2024–25 సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పాండు ఆదివారం తెలిపారు. జనవరి 6లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ఇద్దరు ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి ఎస్‌బీలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మొహమ్మద్ అబ్దుల్ రజాక్, ఎండీ కురిషద్‌అలీ పటాన్‌చెరు ఎస్ఐలుగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

గ్రీటింగ్ కార్డులు.. తీపి జ్ఞాపకాలు

- న్యూఇయర్ వస్తే సందడి
- ఇప్పుడంతా స్మార్ట్ ప్రపంచమే

సంగారెడ్డి టౌన్: కంప్యూటర్ యుగంలో గ్రీటింగ్ కార్డులు కనుమరుగయ్యాయి. గతంలో న్యూ ఇయర్ వచ్చిందంటే ఈ కార్డులకు గిరాకీ అంతాఇంతా కాదు. భావాలను వ్యక్తపరిచేందుకు వివిధ రకాల కార్డులు ఉండేవి. మనసులోని మాటలకు అక్షర రూపం ఇచ్చి మిత్రులకు వారం రోజుల ముందే పోస్టు చేసేవారు. కానీ ఈ సాంకేతిక యుగంలో యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఈమెయిల్స్‌లో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ.. సందేశాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన గ్రీటింగ్ కార్డులు ఇప్పుడు స్మార్ట్ ప్రపంచంలో కనిపించకుండా పోయాయి. ప్రస్తుత జనరేషన్.. నెట్లో లభించే వివిధ రకాల గ్రీటింగ్ స్టిక్కర్లను పంపిస్తూ క్షణాల్లో శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు.



జ్ఞాపకాలుగా మిగిలాయి

గ్రీటింగ్ కార్డులు గతంలో క్రిస్మస్ ముందు నుంచే సందడిచేసేవి. ఇక న్యూ ఇయర్, సంక్రాంతి వరకు కార్డుల హడావుడి ఉండేది. ప్రతి సందర్భానికి గ్రీటింగ్ కార్డులతో శుభాకాంక్షలు తెలుపుకునే వారు. కాని ఇపుడు వాటి ఊసేలేదు. ఏ విషయం చెప్పాలన్నా సెల్ ఫోన్‌నే ఆశ్రయిస్తున్నారు. దీంతో అవి తీపి జ్ఞాపకాలుగా మిగిలాయి.



ఇప్పుడు అంతా స్మార్ట్ ప్రపంచం

గ్రీటింగ్ కార్డులు చూద్దామన్నా కానరావడం లేదు. మా స్కూల్ స్థాయి నుంచి కాలేజీ వరకు ఏటా గ్రీటింగ్ కార్డుల ద్వారానే శుభాకాంక్షలు చెప్పుకునే వాళ్లం. ఇప్పుడు ఆ అవకాశం లేదు. అంతా సోషల్ మీడియానే. సెల్ ఫోన్ ప్రపంచంతో గ్రీటింగ్‌ల జాడని లేకుండా పోయింది.

– మధుసూదన్, ప్రైవేటు ఉద్యోగి

నల్లపోచమ్మ ఆలయానికి నూతన సంవత్సర శోభ

భక్తుల జాగారానికి ప్రత్యేక ఏర్పాట్లు

మనూరు(నారాయణఖేడ్): మంజీరా నదీతీరం వద్ద ప్రసిద్ధి చెందిన బోరంచ నల్లపోచమ్మ ఆలయం నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబైంది. కొత్త ఏడాది సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఒక్క రోజు ముందుగా వచ్చి ఆలయం వద్ద జాగారం చేస్తారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు. హైద్రాబాద్, మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఏ ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు.


నల్లపోచమ్మ అమ్మవారు

పాండురంగ మందిరంలో పడిపూజ

కోహీర్(జహీరాబాద్): పట్టణంలోని శ్రీపాండురంగ మందిరంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీకాంత్‌రెడ్డి స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మెట్టు పూజ అనంతరం తీర్థ ప్రసాద వితరణ అన్నదానం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప మాల ధారులు నర్సింహారెడ్డి, జగన్నాథ్ రెడ్డి, మహేశ్, వీరేశం, రాజు, అమర్నాథ్, కిరణ్ కుమార్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.


పడిపూజలో పాల్గొన్న భక్తులు

కొత్త సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు రాజశేఖర్ షెట్కార్, ప్రధాన కార్యదర్శి ఆర్.సుభాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం(టీబెస్) ఆధ్వర్యంలో కూడా నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. స్థానిక బంజారా భవన్‌లో టీబెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు తుకారాం చౌవాన్, హన్మంత్ పవార్, హీరు రాథోడ్, అర్జున్ చౌవాన్, జైసింగ్ చౌవాన్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం..

సదాశివపేట(సంగారెడ్డి): మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బసవ సేవాసదన్ ఫంక్షన్ హాలులో మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లోడి జయమ్మ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు.

ప్రజలపై మల్లన్న ఆశీస్సులు ఉండాలి

పటాన్‌చెరు టౌన్: మల్లన్న ఆశీస్సులు ప్రజలపై ఉండి తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ ఆకాంక్షించారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో జరుగుతున్న మల్లికార్జున జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరలు, ఉత్సవాలు తెలంగాణ సంస్కృతిని, ప్రతిబింబిస్తాయన్నారు.